

దాబా గ్రామంలో ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులను చెదరగొడుతున్న పోలీసులు

నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 27 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



శైలజ అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు

# ఖాకీల నీడన కన్నీటి వీడ్కోలు

## పోలీసుల ఆంక్షల నడుమ సాగిన శైలజ అంత్యక్రియలు

- వాంకిడి నుంచి దాబా గ్రామం వరకు భద్రత
- విద్యార్థిని ఇంటి చుట్టూ పోలీసులే
- కడసారి చూపునకు బంధువులు కూడా రాలేని పరిస్థితి
- ఎక్స్‌గ్రేషియాపై లభించని స్పష్టమైన హామీ
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లుతో సరిపెట్టిన అధికారులు
- ఇది ప్రభుత్వ హత్యే : ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని కెరమెరి, దేవాపూర్‌లో రాస్తారోకో



శైలజ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ వాంకిడి, నవంబర్ 26 : వాంకిడి ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన శైలజ అంత్యక్రియలు ఆమె స్వగ్రామం దాబాలో మంగళవారం ఖాకీల ఆంక్షల నడుమ సాగాయి. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీవో లోకేశ్వర రావు, డీటీడబ్ల్యూవో రమాదేవి, వాంకిడి తహసీల్దార్ రియాజ్ అలీ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించగా, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ –టీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, గ్రామస్తులు, బంధువులు, మాలీ, గిరిజన సంఘాల నాయకులు, తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

### వాంకిడి నుంచి దాబా వరకు..

శైలజ అంత్యక్రియల నేపథ్యంలో దాబా గ్రామంలో పోలీసులు అడుగడుగునా మోహరించారు. ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ అలం ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి నుంచే వాంకిడి మండలంతో పాటు దాబా గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా శైలజ మృతదేహాన్ని తీసుకొచ్చారు. ప్రజా సంఘాలు, బంధువులు ఎలాంటి ఆందోళనలు చేయకుండా భద్రత ఏర్పాట్లు చేసి ఉక్కుపాదం మోపారు. శైలజ మృతదేహం వద్దకు వెళ్లి కనీసం నివాళులర్పించే అవకాశం కూడా ఇవ్వలేదు. వాంకిడి మండల కేంద్రం నుంచి దాబా గ్రామం వరకు ప్రధాన కూడళ్లు.. మధ్యలో ఉన్న గ్రామాల వద్ద ప్రత్యేకంగా పోలీసు క్యాంపులు ఏర్పాటు చేశారు. దాబా గ్రామం నుంచి ఎవరూ బయటకు వెళ్లకుండా.. బయట నుంచి ఎవరూ గ్రామంలోకి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మీడియాను గ్రామంలోకి రాకుండా ఆంక్షలు విధించారు. శైలజ అంత్యక్రియలకు వచ్చే బంధువులను కూడా గ్రామంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు.



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

### ఎమ్మెల్యే కోవ లక్ష్మి హౌస్ అరెస్టు

ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సోమవారం రాత్రి హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు.. మంగళవారం మాత్రం దాబా గ్రామానికి వెళ్లేందుకు అనుమతించారు. దీంతో కోవ లక్ష్మి దాబా గ్రామానికి వెళ్లి శైలజ కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

### ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లుతో సరి

శైలజ కుటుంబానికి అండగా నిలవాల్సిన అధికారులు కేవలం ఆమె ఇంట్లో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని చెప్పి సరిపెట్టారు. ఎక్స్‌గ్రేషియాపై ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేపోయారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ సీతక్కతో చర్చించిన తర్వాత ఈ విషయం తెలిపారు. శైలజ తల్లిదండ్రులు తుకారాం, మీరాబాయి తమకు ఐదు ఎకరాల భూమి, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరారు. అధికారులు మాత్రం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇంటితో సరిపెట్టడంపై ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### ప్రభుత్వ హత్యగానే భావిస్తున్నాం : ఎమ్మెల్యే కోవలక్ష్మి

శైలజ మృతిని కాంగ్రెస్ ప్రభుత్వ హత్యగానే భావిస్తున్నాం. కనీసం విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శించకుండా పోలీసులు ఇంతటి నిర్బంధం పెట్టారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. శైలజ కుంటుంబానికి అండగా ఉంటాం. విద్యార్థి మృతి పట్ల ప్రజాసంఘాలు స్పందించకుండా పోలీసులు ఉక్కుపాదం మోపారు, అర్ధరాత్రి నన్ను హౌస్ అరెస్ట్ చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి.

### పరామర్శకు వెళ్లకుండా అడ్డుకుంటారా?

చెన్నూర్, నవంబర్ 26: శైలజ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లకుండా ఎమ్మెల్యే కోవ లక్ష్మిని అడ్డుకోవడం దారుణమని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి, మున్సిపాలిటీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. తన నియోజకవర్గానికి చెందిన శైలజ కుటుంబాన్ని ఓదార్చేందుకు వెళ్లకుండా ఇంట్లోకి చొరబడి హౌస్ అరెస్టు చేయడం సరికాదని తెలిపారు. శైలజ మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను బట్టి ప్రభుత్వం గురుకులాలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి భోజనాన్ని అందిస్తున్నదో స్పష్టమవుతుందని తెలిపారు.

### కెరమెరిలో రాస్తారోకో

కెరమెరి, నవంబర్ 26 : శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కెరమెరిలో మాలీ సంఘం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. బీఆర్ఎస్, బీజేపీ, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ శైలజకు సరైన వైద్యం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడాడ్డారు. విద్యార్థి మృతికి బాధ్యత వహిస్తూ ఆమె కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, 5 ఎకరాల వ్యవసాయ భూమి, ఇందిరమ్మ ఇల్లుతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెందోర్ ఆనంద్‌రావ్, ఉత్తంనాయక్, కావుడే తుల సీరాం, సుభాష్, భరత్ భూషణ్, తుకారాం, దేవేందర్, మహండోరే రవి, జగన్నాథ్‌రావ్, వినేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఆదివాసీ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో..



దేవాపూర్‌లో ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

కాసిపేట, నవంబర్ 26 : వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం దేవాపూర్‌లోని కుమ్రం భీం చౌరస్తా వద్ద ఆదివాసీ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెడ్మ కిషన్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే బాలిక చనిపోయిందని మండిపడ్డారు. బాలిక కుటుంబానికి నష్టపరిహారం కింద రూ.50 లక్షలు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, బాలిక మృతి కారణమైన డీటీడీవో, ఏటీడీఏ, వార్డెన్, హెచ్ఎం, ఐటీడీఉ పీవోలను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థి సంఘం, తుడుం దెబ్బ అనుబంధ సంఘాలతో ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతామని హెచ్చరించారు. తుడుం దెబ్బ ఆదివాసీ సంఘాల నాయకులు ఆడె జంగు, పెంద్రం హన్మంతు, అనంతరావు, ఆత్రం జంగు, గోవర్ధన్, సిడం శంకర్, ప్రభాకర్, ఆత్రం మహేశ్, మడావి ధర్మారావు, సిడం జగన్, తరుణ్, రామారావు, లింగు, పవన్, అర్జున్, సాంబ పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచిపోయే శుభదినం దీక్షా దివస్

## తెలంగాణ ఉద్యమ చరిత్రపై చెరగని సంతకం చేసిన మహనీయుడు కేసీఆర్

- ఉద్యమ స్ఫూర్తితో కాంగ్రెస్ హామీలపై కొట్లాడుదాం
- కాంగ్రెస్ పాలనను ప్రజలు ఛీదరించుకుంటున్నారు
- కేసులకు భయపడేది లేదు.. ప్రజల పక్షాన పోరాటం చేస్తాం
- భవిష్యత్ బీఆర్ఎస్‌దే.. కార్యకర్తలు ఆందోళన చెందవద్దు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి తుల ఉమ
- నస్పూర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య




దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న దీక్షా దివస్ మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి తుల ఉమ

సీసీసీ నస్పూర్, నవంబర్ 26: చరిత్రలో నిలిచిపోయే శుభదినం.. దీక్షా దివస్ అని బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి తుల ఉమ పేర్కొన్నారు. ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షా దివస్ కార్యక్రమంపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని ములుపు తిప్పి, ఉద్యమ చరిత్రపై చెరిగిపోని సంతకం చేసిన మహా నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా 2009, నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షను మరోసారి యాది చేసుకుందామని, ఈ నెల 29న మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కేసీఆర్ తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో మళ్లీ రగిలించేలా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతామన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై కొట్లాడుదామని పిలుపునిచ్చారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ కుంభకోణాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్‌ను ఛీదరించుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ప్రజలంతా కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారన్నారు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతూ, దాడులు కొనసాగిస్తున్నారని, కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేదిలేదన్నారు. ఉద్యమంలో వందలాది కేసులు పెట్టినా వెనుకడుగు వేయలేదని.. కాంగ్రెస్ కేసులతో తమను భయపట్టలేదని, నిత్యం ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామన్నారు. కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, భవిష్యత్ అంతా బీఆర్ఎస్‌దేనని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజా పాలనను కాంగ్రెస్ గాలికి వదిలేసి, కూల్చివేతలు, పథకాల్లో కోతలు, అభివృద్ధి పేరుతో విధ్వంసాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# రైతు కూలీలకు రూ.15వేల పెన్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

జన్నారం, నవంబర్ 26 : 50 ఏళ్లు నిండిన రైతు కూలీలకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం రేండ్లగూడ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. స్వామిరంగనాథన్ కమిషన్ సిఫారసు మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. వచ్చేనెల ఒకటిన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని నిర్వహించే వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఏనుగు శుభాష్‌రెడ్డి, అల్లం లచ్చన్న, అల్లం నరేశ్ పాల్గొన్నారు.



పట్టుబడిన గంజాయితో రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, అధికారులు

# నేరాల కట్టడికి కృషి చేయాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్
- జైపూర్ ఏసీపీ కార్యాలయం తనిఖీ



జైపూర్ ఏసీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న సీపీ

జైపూర్, నవంబర్ 26 : నేరాల కట్టడి కోసం సమష్టిగా కృషి చేయాలని రామగుండం పోలీస్‌కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం సాయంత్రం మంచిర్యాల జోన్ జైపూర్ ఏసీపీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులను దర్యాప్తు చేయాలని సూచించారు. జైపూర్ సబ్ డివిజన్ పరిధిలో మావోయిస్టు ప్రభావిత గ్రామాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాత్రి వేళల్లో గ్రామాల్లో నిఘా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు వేణుచందర్, సుధాకర్, రవీందర్ పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 26 : మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. 2021 నుంచి రామగుండం కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన 65 కేసుల్లో నిందితుల నుంచి సీజ్ చేసిన 521.544 కిలోల (సుమారు రూ.1,30,38,600 విలువ) గంజాయిని కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా మానకొండూర్ వద్ద నిబంధనలు పాటిస్తూ దహనం చేశారు.




